క్లుప్తంగా

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

బల్లికురవ: మండలంలోని పాతమల్లాయపాలెంలో యూత్ ఆధ్వర్యంలో జరుగుతున్న జిల్లా స్థాయి టెన్నిస్‌బాల్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. 52 టీమ్‌లు ఎంట్రీలు సమర్పించగా ఈ నెల 17న ఎస్సై వేమన లాంఛనంగా ప్రారంభించారు. శుక్రవారం జరిగిన మొదటి లీగ్‌లో మల్లాయపాలెం, కొప్పరపాలెం మధ్య జరిగిన పోరులో కొప్పరపాలెం టీమ్ విజేతగా నిలిచారు. సాయంత్రం కొమ్మాలపాడు, మల్లాయపాలెం మధ్య జరిగిన పోరులో మల్లాయపాలెం జట్టు, వలపర్ల, కేరాజుపాలెం మధ్య జరిగిన పోరులో వలపర్ల జట్టు విజేతలుగా నిలిచారు. మరో పది రోజులపాటు పోటీలు జరుగుతాయని నిర్వాహక కమిటీ తెలిపారు. విజేత్నకు మొదటి బహుమతిగా రూ.20 వేలు, 2వ బహుమతిగా రూ.15 వేలు, 3వ బహుమతిగా రూ. 10 వేలు అందజేయనున్నట్లు కమిటీ తెలిపారు.

ఐరిష్ ద్వారా ప్రతి ఒక్కరికీ రేషన్

అద్దంకి: ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న రేషన్‌ను ప్రతి లబ్ధిదారుడికి అందే విధంగా చూడాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ వాసుదేవరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆయన నియోజకవర్గంలోని ఎండీయూ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్డుదారులకు ఇంటికే రేషన్ అందిస్తున్న విషయం గుర్తుచేశారు. ఈ క్రమంలో ఎవరికి వేలి ముద్ర పడలేదని రేషన్ నిరాకరించవద్దన్నారు. వేలు గుర్తులు పడనివారికి ఐరిష్ ద్వారా రేషన్ ఇస్తారని, ఎవరూ ఇబ్బంది పడాల్సిన అవసరం లేదన్నారు. దానికోసం ప్రతి ఎండీయూ ఆపరేటర్‌కు ఐరిష్ పరికరాన్ని అందించి శిక్షణ అందిస్తామని తెలిపారు. తరువాత ఎండీయూ ఆపరేటర్లకు ఐడెంటిటీ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎండీయూ ఆపరేటర్లు పాల్గొన్నారు.

మద్యం షాపులో చోరీ



నగదు బాక్స్‌ను పరిశీలిస్తున్న ఎస్సై సురేష్

వేటపాలెం: గ్రామ శివారులో ఉన్న మద్యం షాపులో దొంగలు పడి నగదు చోరీకి పాల్పడ్డారు. ఈఘటన పందిళ్లపల్లి శివారులో గురువారం అర్ధరాత్రి జరిగింది. అందిన వివరాల మేరకు.. మద్యం షాపుపైన రేకులు పగులగొట్టి దొంగలు లోనికి ప్రవేశించారు. షాపులో ఉన్న ఇనుప నగదు బాక్సులో రూ. 2.57 లక్షలు నగదు దోచుకెళ్లారు. ఈ మేరకు షాపు సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ సీఐ మల్లికార్జునరావు, ఎస్సై జీ సురేష్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఒంగోలు నుంచి క్లూస్ టీంని రప్పించి వేలిముద్రలు సేకరించారు. అయితే మద్యం షాపునకు ఇద్దరు వాచ్‌మెన్లు ఉన్నప్పటికీ షాపులో చోరీ జరగడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. పోలీసులు కేసు నమోదు చేసుకొని వాచ్‌మెన్‌లను విచారిస్తున్నారు.

పర్చూరు డిప్యూటీ డీఈవోగా శ్రీనివాసులు



శ్రీనివాసులును అభినందిస్తున్న హెచ్‌ఎంలు

పర్చూరు (చినగంజాం): పర్చూరు ఉప విద్యాశాఖాధికారిగా ఆర్ శ్రీనివాసులు నియమితులయ్యారు. శుక్రవారం ఆయన ఉప విద్యాశాఖాధికారి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు ప్రధానోపాధ్యాయులు ఆయనను శాలువా కప్పి అభినందించారు. గతంలో పనిచేసిన కిరణ్‌కుమార్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో ప్రభుత్వం శ్రీనివాసులను నియమించింది. ఈయన గతంలో మైనంపాడు డైట్ కాలేజీ లెక్చరర్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. కార్యక్రమంలో డీ నాగేశ్వరరావు, బొప్పూడి హెచ్‌ఎం బాల ప్రసాద్, ఈదర రాజశేఖర్, మొలబంటి వెంకటేశ్వర్లు, సుబ్బారావు, మల్లికార్జునరావు, జీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

టైలరింగ్ షాపులో అగ్ని ప్రమాదం

చీరాల అర్బన్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలోని కేకేసీ కాంప్లెక్స్‌లోని టైలరింగ్ షాపులో శుక్రవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కాంప్లెక్స్‌లోని డీసెంట్ టైలర్స్ షాపులో శుక్రవారం షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో షాపులోని ఫర్నీచర్, వస్త్రాలు అగ్నికి ఆహుతయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో రూ.1.90 లక్షలు ఆస్తి నష్టం వాటిల్లింది. ఈమేరకు షాపు యజమాని డి.నాగేశ్వరరావు నుంచి అగ్నిమాపక సిబ్బంది వివరాలు నమోదు చేశారు.

వైద్యం నిండుగా.. సేవలు మెండుగా

- సురక్షిత కాన్పులకు కేరాఫ్‌గా చీరాల ప్రభుత్వాసుపత్రి
- ప్రతినెలా 70 నుంచి 90 వరకు కాన్పులు
- తల్లీబిడ్డ వాహనంతో క్షేమంగా ఇంటికి
- గైనిక్ వైద్యులు శాంతి వైష్ణవి, షణ్ముకి ప్రత్యేక దృష్టి



గైనిక్ వార్డులో వైద్యసేవలు అందుకుంటున్న బాలింతలు, గర్భిణులు

చీరాల రూరల్: ఒక వైపు సంక్షేమం మరో వైపు అభివృద్ధి రెండింటినీ సమపాళ్లగా చూసుకుంటూ ముందుకు దూసుకెళ్తోంది రాష్ట్ర ప్రభుత్వం. విద్య, వైద్యం, ఆరోగ్యం కూడా అభివృద్ధిలో భాగమే అని చెప్పుకోవచ్చు. ఎన్నో ఏళ్లుగా గత ప్రభుత్వాల కారణంగా ప్రభుత్వ ఆసుపత్రులు నిర్వీర్యమై కార్పొరేట్లకు దాసోహం అయ్యారు. కాని నేడు ఆపరిస్థితి మారింది. సీఎం జగన్ మోహన్‌రెడ్డి అధికారంలో వచ్చాక ఎన్నో సంస్కరణలు మరెన్నో విప్లవాత్మక మార్పులు తెచ్చారు. వైద్యం, ఆరోగ్యంలో అర్బన్ హెల్త్ సెంటర్లు, సచివాలయాల పరిధిలో హెల్త్ క్లినిక్‌లు, ఇంటి వద్దకే వైద్యం ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో అభివృద్ధి పనులు చేశారు. విద్య, వైద్యం, ప్రజా సంక్షేమం తరువాతే ఏదైనా అనే నినాదంతో ముందుకు వెళ్తున్న సీఎం జగన్ వాటిని తూచా తప్పకుండా క్షేత్రస్థాయిలో అమలు చేస్తున్నారు. గత ప్రభుత్వాల హయాంలో అవసానదశలో కూరుకుపోయిన విద్యావ్యవస్థను సన్మార్గంలో నడిపిస్తున్నాడు. నాడు-నేడు పేరుతో కోటాను కోట్లాది రూపాయలు వెచ్చించి శిథిలమైన పాత భవనాలన్నింటిని తొలగించి వాటి స్థానంలో నూతన భవనాలు నిర్మించి కార్పొరేట్ స్థాయిలో చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారు. అలానే నవరత్నాల్లో భాగంగా ప్రజల ఆరోగ్యంపై దృష్టిసారించిన ఆయన ఆరోగ్యశ్రీలో అనేక జబ్బులను చేర్చి పేదల పాలిటి పెన్నిధిలా మారారు.

చీరాల ఆస్పత్రిలో తల్లీబిడ్డల కాన్పుల వార్డు..

చీరాల దుగ్గిరాల గోపాలకృష్ణయ్య స్మారక 100 పడకల ప్రభుత్వాసుపత్రిలో 34 పడకలు గల తల్లీబిడ్డల కాన్పుల వార్డు ప్రత్యేకత సంతరించుకుంది. ఇక్కడి గైనిక్ వైద్యులు నెలకు సరాసరి 70 నుంచి 90 వరకు కాన్పులు అవలీలగా చేసేస్తున్నారు. వాటిలో అధిక భాగంగా సర్జరీలు లేకుండా సహజ కాన్పులు చేస్తున్నారు. తల్లీబిడ్డల వార్డులో ప్రస్తుతం వైద్య సేవలందిస్తున్న డాక్టర్ శాంతి వైష్ణవికి తోడుగా మరో గైనిక్ వైద్యురాలు షణ్ముకి బదిలీపై చీరాల ఆస్పత్రికి వచ్చారు. ఈ ఇద్దరు వైద్యులు ఎంతో నిబద్ధతతో అంకిత భావంతో రేయింబవళ్లు వైద్య సేవలందిస్తున్నారు. వీరికి తోడు ఆస్పత్రి ఇన్‌చార్జ్ పర్యవేక్షకురాలు చిన్నపిల్లల వైద్యురాలు డాక్టర్ పి. సుభాషిణి భరోసా వారికి చక్కగా తోడ్పాటునందిస్తోంది. వార్డులో తల్లి బిడ్డలు సేదతీరేందుకు మూడు ఏసీలు బిగించారు. ఎండవేడిమి తగలకుండా స్లాబుపై కూల్ పెయింటింగులు వేయిస్తున్నారు.

ఎక్కడా కూడా తగ్గని లక్ష్యం...

ఈ ఏడాది జనవరి నుంచి మే వరకు అంటే ఇప్పటి వరకు సరాసరి నెలకు 70 నుంచి 90 వరకు వైద్యులు డెలివరీలు చేసారంటే వారి సామర్థ్యం ఏమిటో ఇట్టే అర్థమైపోతుంది. జనవరి నెలలో 70, ఫిబ్రవరిలో 68, మార్చిలో 81, ఏప్రిల్‌లో 89, మేనెల ఇప్పటి వరకు 80 డెలివరీలు చేశారు. అంతేకాకుండా పురుడుపోసుకున్న తల్లుల బ్యాంకు ఖాతాల్లో వారు ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యే రోజే డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య ఆసరా పథకం కింద రూ. 5,000 వరకు జమచేస్తున్నారు. అంతేకాకుండా సురక్షింతంగా తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ద్వారా ఇంటికి చేర్చుతున్నారు.

ఇబ్బందులు లేకుండా సేవలందిస్తున్నాం..



ప్రభుత్వాసుపత్రిలో పురుడు పోసుకున్న తల్లీబిడ్డలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కంటికి రెప్పలా కాపాడుతున్నాం. వారికి కావాల్సిన మందులు, భోజనం ఎంతో నాణ్యతతో కూడుకున్నవి అందిస్తున్నాం. వార్డులో మరిన్ని సౌకర్యాలు అందించేందుకు గాను ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా రూ.1,15,000 బడ్జెట్‌ను మంజూరు చేసింది. ప్రస్తుతం చీరాల ప్రభుత్వాసుపత్రి వైద్య సేవల విషయంలో కార్పొరేట్ ఆస్పత్రులను మించిపోయింది. ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించకుండా ప్రభుత్వాసుత్రుల్లో చేరి కాన్పులు చేయించుకోవాలి.

– డాక్టర్ సుభాషిణి, ఇన్‌చార్జ్, మెడికల్ సూపరింటెండెంట్



ఆపరేషన్ థియేటర్

ఆధునిక టెక్నాలజీతో ఎస్‌బీఎస్‌యూ..



బలహీనంగా చిన్నారులకు ఏర్పాటు చేసిన ఎస్‌బీఎస్‌యూ వార్డు

ఆస్పత్రుల్లో చేరిన గర్భిణులు ఒక్కోసారి నెలలు నిండకుండానే బిడ్డకు జన్మనిస్తారు. అటువంటి వారు బరువు తక్కువ ఉంటారు. వారికి శ్వాస పీల్చుకోవడం కూడా చాలా కష్టతరంగా ఉంటుంది. అటువంటి వారిని ఆత్యాధునిక ఎస్‌బీఎస్‌యూ వార్డులోని మార్చి ప్రత్యేకంగా తయారు చేసిన పరికరాలను అమర్చి వారు పూర్తిగా కోలుకునే వరకు అక్కడే ఉంచుతారు. ఈ విధమైన వైద్య సేవలను పొందుకోవాలంటే ప్రైవేటు వైద్యశాలలయితే అధిక మొత్తంలో ఫీజుల రూపంలో వసూలు చేస్తారు. ప్రభుత్వాసుపత్రిలో కాకుండా ప్రైవేటు ఆస్పత్రిలో కాన్పు చేయించుకోవాలంటే రూ. 40 నుంచి 50 వరకు చెల్లించుకోవాల్సిందే. కానీ ప్రభుత్వాసుపత్రిలో మంచి అనుభవం కలిగిన గైనిక్ వైద్యుల పర్యవేక్షణలో తల్లీబిడ్డలు క్షేమంగా వైద్య సేవలు అందుకోవచ్చు.

వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శం



మహిళా వలంటీర్‌కు సేవావజ్ర అవార్డు అందిస్తున్న వెంకటేష్



చీరాలలో మాట్లాడుతున్న కరణం వెంకటేష్

- వలంటీర్లకు సేవా పురస్కారాలు
- ప్రదానం చేసిన నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్

చీరాల: రాష్ట్రంలో ఏర్పాటైన వలంటీర్ల వ్యవస్థ ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిందని కరణం వెంకటేష్ అన్నారు. శుక్రవారం ఎన్‌ఆర్‌పీఎం హైస్కూల్ ఆవరణలో ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో వార్డు వాలంటీర్లకు సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర పురస్కారాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న కరణం వెంకటేష్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పారదర్శకమైన పాలన అందించే ప్రయత్నంలో దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను ఏర్పాటు చేసి గృహాల సాధకబాధలన్ని వలంటీర్లు పాలుపంచుకునేలా ఏర్పాటు చేయడం అద్భుతమన్నారు. పార్టీలకు అతీతంగా ఈ వ్యవస్థను దేశంలో ప్రతి ఒక్క ప్రజా ప్రతినిధులు కొనియాడుతున్నారన్నారు. మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు మాట్లాడుతూ వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా అందుతున్నాయన్నారు. ఏ సమస్య వచ్చిన అధికారుల వద్దకు కాకుండా వలంటీర్లు ద్వారా నేరుగా సచివాలయాలకు అక్కడి నుంచి అధికారులకు అందుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత డాక్టర్ గుంటుపల్లి సుబ్బారావు, అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ మల్లి వైష్ణవీ, వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, మున్సిపల్ కమిషనర్ కే రామచంద్రారెడ్డి, కౌన్సిలర్లు చీమకుర్తి బాలకృష్ణ, మల్లెల లలిత, ఈసర్ల సుజాత, బత్తుల అనిల్, మించాల సాంబశివరావు, కీర్తి వెంకట్రావు, ఎం రాములు, పొత్తూరి సుబ్బయ్య, యాతం జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వేటపాలెం: గ్రామ వలంటీర్లు మరింత బాధ్యతగా పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని చీరాల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయాల ప్రాంగణంలో వలంటీర్లకు సేవా పురస్కారాల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న వెంకటేష్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలు పేదలకు చేరవేయడంలో వలంటీర్లదే ప్రధానపాత్ర అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వలంటీర్లను ఎంతో నమ్మకం పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తెస్తారని వారిని నియమించారని తెలిపారు. అనంతరం వలంటీర్లను సన్మానించి ఇద్దరు వలంటీర్లకు సేవావజ్ర, ఐదుగురు వలంటీర్లకు సేవారత్న, 399 మంది వలంటీర్లకు సేవామిత్ర పురస్కారాలు ప్రదానం చేశారు. మొత్తం 406 మంది వలంటీర్లను సన్మానించి పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శర్మ, సర్పంచ్ కందేటి రమణ, ఆర్‌బీకే చైర్మన్ పల్లపోలు శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ దంతం వెంక సుబ్బారావు, పులి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్‌లు లేళ్ల శ్రీధర్, కట్టా గంగయ్య, పృథ్వీ చంద్రమోహన్, జంగిలి రామారావు, అందే కృష్ణ, రొండా భరత్, ఆవుల అశోక్, ఖాదర్, ఖజ్జీ, జమ్మి ప్రసాద్‌రెడ్డి, జిడుగు మస్తాన్, బొడ్డు సుబ్బారావు, గవిని వెంకట్రావు, పులి సోమయ్య, పులి శ్రీనివాసరావు, బుర్ల శివ, నంగుప్రభాకర్ రెడ్డి, పులి హరికృష్ణ, ఏవో కాశీవిశ్వనాథ్, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.



ఇంకొల్లులో వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

ఇంకొల్లులో..

ఇంకొల్లు (చినగంజాం): మండలంలోని గ్రామ వలంటీర్‌లకు శుక్రవారం పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమంలో ఇంకొల్లు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఏ శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మొత్తం 220 మంది వలంటీర్లకు సేవారత్న పురస్కారాలు ఐదుగురికి అందజేయగా, మిగిలిన వలంటీర్‌లకు సేవా మిత్ర అందజేశారు. ఇందులో భాగంగా వారికి శాలువా కప్పి, మెడల్, నగదు ప్రోత్సాహకం అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎంటీ మోహనరావు, ఏపీవో రేణుక, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ వలంటీర్‌లు, అధికారులు, ప్రజాప్రతినిధులు, మండల కన్వీనర్ బండారు ప్రభాకరరావు పాల్గొన్నారు.

గ్రావెల్ తరలిస్తున్న లారీలు స్వాధీనం

బల్లికురవ: పర్మిట్‌కు రాయి కొలతకు వ్యత్యాసం ఉంటే గ్రానైట్ లారీలను అదుపులోకి తీసుకుంటామని బల్లికురవ ఎస్సై వీ. వేమన హెచ్చరించారు. శుక్రవారం పల్నాడు జిల్లా వినుకొండ మండలం గోగనకొండ నుంచి మండలంలోని వేమవరం పరిశ్రమలకు వెళ్తున్న ఏపీ 16 టీఈ 5629 లారీని బల్లికురవలో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలో పర్మిట్‌కు రాయికి వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించి మైనింగ్ అధికారులకు అప్పగించారు. పర్మిట్ లేకుండా గ్రానైట్ రాళ్లు తరలించి కొలతల్లో వ్యత్యాసం ఉన్నా పెనాల్టీతోపాటు లారీని సీజ్ చేస్తామని హెచ్చరించారు.

వేటపాలెంలో..

వేటపాలెం: వేటపాలెం బైపాస్ మీదుగా ఎటువంటి బిల్లులు లేకుండా అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న రెండు లారీలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై జీ సురేష్ శుక్రవారం తెలిపారు. సాధారణ తనిఖీల్లో భాగంగా బైపాస్ రోడ్డులో గ్రావెల్ లోడ్‌తో వెళ్తున్న రెండు లారీలను ఆపగా బిల్లులు లేకపోవడంతో వాటిని పోలీసు స్టేషన్‌కి తరలించామని ఎస్సై తెలిపారు. లారీ ఓనర్లపై తగిన చర్యల నిమిత్తం మైనింగ్ శాఖ అధికారులకు సిఫార్సు చేస్తామని ఎస్సై చెప్పారు.

30న కొత్తపాలెం పోలేరమ్మవారి తిరునాళ్ల

చీరాల టౌన్: మండలంలోని కొత్తపాలెం గ్రామంలో కొలువైఉన్న కొత్తపాలెం పోలేరమ్మ అమ్మవారి 23వ వార్షిక తిరునాళ్లను ఈనెల 28 నుంచి 30 తేదీ వరకు నిర్వహిస్తున్నామని దేవస్థాన కమిటీ ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 28 గటంకుండ, మహాలక్ష్మీ అమ్మవారి పూజా కార్యక్రమాలు, 30 తేదీన అమ్మవారికి అభిషేకాలు సాయంత్రం శిడిమాను ఉత్సవం, అనంతరం తిరునాళ్లను వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. వార్షిక తిరునాళ్ల సందర్భంగా కోలాటం, మ్యూజికల్ నైట్, విద్యుత్ ప్రభలతో ప్రత్యేక ఆకర్షణను ఏర్పాటు చేశామన్నారు. తిరునాళ్లకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌లు హాజరవుతున్నారని కమిటీ అధ్యక్షుడు బక్కా శివప్రసాద్‌రెడ్డి, కె. కృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, ప్రతినిధులు తెలిపారు.

ఆధునిక టెక్నాలజీతో ప్రమాదాలకు చెక్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీవో

బల్లికురవ: గ్రానైట్ క్వారీలో నిబంధనలు, భద్రతా చర్యలు పాటించటంతోపాటు ఆధునిక టెక్నాలజీ ఉపయోగించటం వల్ల ప్రమాదాలకు చెక్‌పెట్టవచ్చని చీరాల ఆర్డీవో సరోజిని అన్నారు. శుక్రవారం మండలంలోని కొణిదెన రెవెన్యూలోని ఈర్లకొండ సర్వే నంబర్ 103/బీలో 0.598 హెక్టార్లకు శ్రీనివాస గ్రానైట్ క్వారీ ఏర్పాటుకు పర్యావరణ, ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ క్వారీల్లో ప్రమాదాలు తలెత్తకుండా యజమానులు, మేనేజర్లు కార్మికులకు అందుబాటులో ఉంటూ అప్రమత్తతో పనులు చేయించాలన్నారు. ప్రతిరోజు క్వారీ పరిసరాల్లో దుమ్ము లేవకుండా నీళ్లు చల్లించాలన్నారు. ఎవరి హద్దులకు లోబడి వారే పనులు చేయించుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు క్వారీ చుట్టూ చెట్ల పెంపకాన్ని చేపట్టాలన్నారు. కార్మికులకు ఒకేషనల్ శిక్షణతోపాటు ఆరు నెలలకొకసారి వైద్యపరీక్షలు చేయించాలన్నారు. క్వారీల సమీపంలోని గ్రామాలభివృద్ధితోపాటు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆర్డీవో కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డి పర్యావరణ పరిరక్షణ ఈఈ నాగిరెడ్డి క్వారీ నిర్వాహకులు గుంటక తిరుపతిరెడ్డి, వీఆర్‌వో రత్నంరాజు, సర్వేయర్లు రాజు చంద్ర పాల్గొన్నారు.

గాంధీ సిద్ధాంతాలు మార్గదర్శకం



గాంధీజీ మ్యూజియాన్ని ప్రారంభిస్తున్న కళాశాల ప్రతినిధులు

చీరాల టౌన్: సమసమాజ స్థాపనలో మహాత్మా గాంధీజీ సిద్ధాంతాలను మార్గదర్శకంగా తీసుకోవాలని పలువురు వక్తలు సూచించారు. శుక్రవారం మండలంలోని బుర్లవారిపాలెంలోని వీఆర్‌ఎస్ అండ్ వైఆర్‌ఎన్ కళాశాలలో యలమంచిలి సంయుక్తం ఏర్పాటు చేసిన గాంధీజీ విగ్రహం, మ్యూజియాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా యలమంచిలి వ్యవస్థాపకుడు యలమంచిలి రామకృష్ణ, సంస్కృత పండితుడు కుంచాల రఘునాథ్ రెడ్డి, ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సునీల్ గౌతమ్‌లు మాట్లాడారు. ప్రతి విద్యార్థి కళాశాలలోని గాంధీ మ్యూజియాన్ని సందర్శించి గాంధీజీ జీవిత విశేషాలను గురించి తెలుసుకుని మహనీయుల అడుగుజాడల్లో పయనించాలన్నారు. మహాత్ముడి జీవిత విశేషాలతో కూడిన చిత్రాలు, వీడియోలు ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, పట్టాభి దానయ్య, ఎన్‌సీసీ ఆఫీసర్ ఎం.రాజేష్‌బాబు, పాలకవర్గం ప్రతినిధులు, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక శోభ పెంపొందించడమే లక్ష్యం



ప్రతిపాదనలు తయారుచేస్తున్న ఎండోమెంట్ అధికారులు

యద్దనపూడి: భక్తుల మనోభావాలను కాపాడేందుకు దేవదాయశాఖ పరిధిలోని పురాతన ఆలయాలను పునఃనిర్మించటమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నట్లు ఎండోమెంట్ అధికారి స్థపతి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పోలూరు గ్రామంలో ఉన్న గంగా భ్రమరాంబ సమేత చెన్నుమల్లికార్జున స్వామి ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన ఆలయ పునఃనిర్మాణం కోసం ప్రతిప్రాదనలు తయారు చేసేందుకు శుక్రవారం ఆయన ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 200 ఏళ్ల క్రితం నిర్మించిన ఆలయం శిథిలావస్థకు చేరుకోవటంతో గ్రామస్తులు నూతన ఆలయాన్ని నిర్మించేందుకు రూ.40 లక్షల నిధులు సమకూర్చగా మరో కోటి రూపాయలు దేవాదాయశాఖ నుంచి నిధులు మంజూరు చేయాలని ఉన్నతాధికారులకు విన్నవించామన్నారు. ఈ మేరకు ఆలయాన్ని పరిశీలించి ప్రతిపాదనలు సిద్ధం చేశామని, నిధులు మంజూరైన వెంటనే నూతన ఆలయ నిర్మాణ పనులు ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అర్చకుడు నూతలపాటి లలిత్‌ప్రసాద్, ఎండోమెంట్ లైజనింగ్ ఆఫీసర్ గాలి రామారావు, కమిటీ సభ్యులు రాంబాబు, రామస్వామి, ప్రసాద్, మల్లికార్జున, రోశయ్య, రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

రైతులు భూముల వివరాలు అందించాలి



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ పార్వతి

చినగంజాం: భూముల రీసర్వే విషయంలో గ్రామసభకు హాజరుకాని భూ యజమానులు, రైతులు తహసీల్దార్ కార్యాలయంలో హాజరుకావాలని తహసీల్దార్ పాలపర్తి పార్వతి కోరారు. శుక్రవారం మండలంలోని గొనసపూడి గ్రామంలో భూముల రీసర్వేకు సంబంధించి గ్రామసభ నిర్వహించారు. మండలంలో గొనసపూడి, కడవకుదురు, చింతగుంపల గ్రామాల్లో ప్రస్తుతం భూముల రీసర్వే నిర్వహిస్తుండగా క్షేత్ర స్థాయిలో ఆయా గ్రామాల్లో రెవెన్యూ అధికారులు రైతులకు సంబంధించిన ఆధారాలను సేకరిస్తున్నారని చెప్పారు. ఇందులో భాగంగా గొనసపూడి గ్రామంలో క్షేత్రస్థాయిలో భూముల రీసర్వే జరిగిన సమయంలో 300 మంది రైతులు హాజరుకాలేదు. శుక్రవారం గ్రామ సభలో పలువురు రైతుల ఆధారాలను తహసీల్దార్ ఆధ్వర్యంలో సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు తమ భూమికి సంబంధించిన ఆధారాలను గ్రామసభలో ఇవ్వకుంటే తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కథల పుస్తకాలతో మానసిక విజ్ఞానం



అద్దంకి: కథల పుస్తకాలు చూపుతున్న విద్యార్థులు



మార్టూరులో ఆటలాడుతున్న విద్యార్థులు

అద్దంకి: రాష్ట్ర విద్యాశాఖ రూపొందించిన వుయ్‌లవ్ రీడింగ్‌తో విద్యార్థులకు విజ్ఞానం కలుగుతుందని ప్రధానోపాధ్యాయుడు కే రమేశ్‌బాబు అన్నారు. ఆయన మండలంలోని ఏలేశ్వరవారిపాలెం గ్రామ పాఠశాలలో కథలంటే నాకు ఇష్టం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థులకు వేసవి కాలంలో ఏఏ పుస్తకాలు చదవాలి. చదవడం రాయడం వంటి వాటిపై అవగాహన కలిగించారు. అదే విధంగా విద్యార్థులు తరగతి పుస్తకాలనే కాకుండా చిన్న కథల పుస్తకాలను చదవుతూ ఉండాలన్నారు. దాని వలన వ్యక్తిత్వ వికాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్టూరు: విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరంలో పలు క్రీడలపై అవగాహన కల్పిస్తున్నట్లు లైబ్రేరియన్ పావులూరి జానకిరామారావు తెలిపారు. స్థానిక లైబ్రరీలో విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించే విధంగా క్యారమ్స్, లూడో, చదరంగం ఆటలతోపాటు కథలు చదివించటం విద్యార్థులతో చెప్పించినట్లు ఆయన తెలిపారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం, ఉత్తరాయణం జ్యేష్ఠ మాసం, మాఘ నక్షత్రం, అష్టమి తిథి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర శుక్రవారం తెలిపారు. క్షేత్రప్రాధాన్యం ఉన్న శనివారం ఆంజనేయ స్వామికి ఇష్టమైన ఆకు పూజ చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచహారతుల పూజ నిర్వహిస్తారు.